క్లుప్తంగా

చిన్నారులకు చిత్రలేఖన పోటీలు



విజేతలతో చర్చి ఫాదర్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు మాజీ సైనిక కాలనీలోని కింగ్డమ్ చర్చి మత బోధకులు రామకృష్ణ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ సోషల్ సర్వీస్ పూర్ పీపుల్స్ హెల్ప్ సొసైటీ సహకారంతో ఆదివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సుమారు 30 మంది చిన్నారులు పాల్గొని అద్భుత ప్రతిభ చూపారు.విజేతలైన చిన్నారులకు చర్చి ఫాదర్ రామకృష్ణ , వైఎస్సార్ సీపీ నాయకుడు పత్నిరావు బహుమతులు అందించారు.

పోలింగ్ బూత్‌లో ఓటర్లకు అవగాహన



90వ వార్డు పోలింగ్ బూత్ వద్ద విధుల్లో వెల్ఫేర్ అసిస్టెంట్

విశాఖ విద్య: ఓటరు జాబితాలో పేరు ఉన్న వారంతా వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా ఆదివారం ఎన్ఏడీ ఏరియాలోని పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లకు సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించారు. 52, 90 వార్డుల పరిధిలోని సచివాలయాల్లో వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లో సచివాలయ సిబ్బంది విధుల్లో ఉన్నారు. ఓటరు జాబితాలను అందుబాటులో ఉంచారు. వాటిని పరిశీలించుకునేందుకు వచ్చిన ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచాలనే లక్ష్యంతో ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

పంజాబ్ హోటల్ వద్ద కారు-ఆటో ఢీ



ప్రమాదంలో దెబ్బతిన్న కారు, ఆటో

గోపాలపట్నం: పంజాబ్ హోటల్ జంక్షన్ జాతీయ రహదారిపై కారు– ఆటో ఢీకొన్నాయి. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పంజాబ్ హోటల్ జంక్షన్ వద్ద ఆటో సాయినగర్ శివాలయం వైపు నుంచి జాతీయ రహదారి దాటుతుండగా ఆర్అండ్‌బీ జంక్షన్ వైపు నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కారు– ఆటో పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కారును ఎయిర్‌పోర్టు స్టేషన్‌కు తరలించారు. బాధితులు ఫిర్యాదు చేయక పోవడంతో ఇంతవరకు కేసు నమోదు చేయలేదు.

గ్రామ సంఘాల ఎన్నికలు నిషేధించాలి

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి కప్పరాడ, రాంజీ ఎస్టేట్, పెదకొత్తూరు, అంబేడ్కర్ ఎస్టేట్ కొండవాలు ప్రాంతాల్లో గ్రామ సంఘాల ఎన్నికల నిర్వహిస్తే వివాదాస్పద సంఘటనలు జరుగుతాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో గ్రామ సంఘాలకు పదవీ కాలం ముగియడంతో ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు వారు చెబుతున్నారు. మేలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కోడ్ అమలులో ఉండగా తెలిసినా... గ్రామ సంఘాల ఎన్నికలు చూస్తున్నారని, వాటిని నిషేధించాలని కోరుతున్నారు. అలా జరిగితే ఆయా ప్రాంతాల్లో వివాదాస్పద, గొడవలకు దారి తీసే సమయాలు ఉన్నాయని, ఆర్థిక లావాదేవీలు ఎం టివి జరిగే అవకాశముందని, దీనిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ), పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండగ

కోలాహలంగా ఘటాల ఊరేగింపు





అమ్మవారి ఘటాల ఊరేగింపులో భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లో వేంచేసిన సత్తెమ్మతల్లి పండగను ఆదివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు,పంచామృతాలతో అభిషేకం జరిపించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు కాకానినగర్, బుచ్చయ్యనగర్, కనకమహాలక్ష్మి నగర్, విమాన్‌నగర్, వినోద్‌నగర్, సాకేతపురం, దుర్గాపురం గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు వారి పేరిట పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. వేడుకలో భాగంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు కోలాహలంగా సాగింది. మంగళవాయిద్యాలు, కోలాటాలు, వివిధ వేషధారణల నడుమ ఘటాల ఊరేగింపు జరిగింది. సాయంత్రం 4 గంటలకు పరస మహోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సోదరి యలమంచిలి మున్సిపల్ ఛైర్మన్ రమాకుమారి దర్శించుకున్నారు. సమ్మెట్ల రామకృష్ణ, పులపర్తి హరికృష్ణ, భాస్కర్ తదితరులు తగిన ఏర్పాట్లు చేశారు.



అమ్మవారిని దర్శించుకున్న రమాకుమారి

యాదవులకు అండగా నిలుస్తాం

- ఆనంద్‌కుమార్‌ను గెలిపించండి
- యలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి



మాట్లాడుతున్న రమాకుమారి

విశాఖ విద్య: యాదవులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తామని యలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ విజయం కోరుతూ జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో ఆదివారం నిర్వహించిన యాదవ సంఘం ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం బీసీ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. రాజకీయ పదవుల్లో సైతం యాదవులకు సముచిత స్థానం కల్పించిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదే అన్నారు. ఆనంద్ కుమార్‌ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ వార్డు నాయకుడు నమ్మి శ్రీను, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేద్దాం



కరపత్రం అందించి ఆడారి ఆనంద్‌కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థిస్తున్న పిళ్లా రమాకుమారి

సింథియా: రాష్ట్ర భవిష్యత్తు కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమని యలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. అందుకుగానూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీపడుతున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. 62వ వార్డు అంబేడ్కర్ కాలనీలో ఆదివారం కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో ఆనంద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా పేదల చెంతకే సంక్షేమ పథకాలను అందిస్తుంటే.. అటువంటి వ్యవస్థపై టీడీపీ–జనసేన–బీజేపీలు విషం చిమ్ముతున్నాయన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి అటువంటి పార్టీలకు తగిన గుణపాఠం నేర్పాలన్నారు. పేదలకు సేవ చేసే భాగ్యాన్ని తన తమ్ముడు ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఇవ్వాలని రమాకుమారి కోరారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మహిళలు పాల్గొన్నారు.

ఆహార నియంత్రణే మధుమేహానికి మందు



మధుమేహంపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పిస్తున్న ఆస్పత్రి సిబ్బంది



కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు, వ్యాధిగ్రస్తులు

గోపాలపట్నం: మధుమేహం ప్రాణాంతకమైనది కాదని, ఆహార నియంత్రణ పాటిస్తే దీనికి దూరంగా బతకవచ్చని మధుమేహ వ్యాధి వైద్య నిపుణుడు డాక్టర్ లోక్‌నాథ్ త్రిపాఠి అన్నారు. గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో బెహరా ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం మధుమేహంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు వయసు పైబడిన వారికి మాత్రమే మధుమేహం వచ్చేదని, నేడు వయసుతో ప్రమేయం లేకుండా వస్తోందని వివరించారు. కాలాన్ని బట్టి మారుతున్న అలవాట్లే ఇందుకు కారణమన్నారు. ఆహారం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు నిత్యం వ్యాయామం ఎంతో అవసరమని చెప్పారు. మహిళా వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మహిళలు సుగర్ వ్యాధికి గురైతే పిల్లలకు అవయవ లోపం వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. సుగర్ వ్యాధి ఉన్న గర్భిణులు పోషక విలువలున్న కూరగాయలు, పప్పుదినుసులు, కొవ్వులేని మాంసాహారాన్ని తీసుకోవాలని సూచించారు. బెహరా ఆస్పత్రి ఎండీ బెహరా రవితేజ మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. సేవా దృక్పథంతో అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో స్థానికులు, మధుమేహం వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు. వారి సందేహాలను వైద్యులు నివృత్తి చేశారు. మధుమేహంపై అవగాహన కల్పించేందుకు ఆస్పత్రి సిబ్బంది ప్లకార్డులతో చేసిన ప్రదర్శన అందరినీ ఆలోచింపజేసింది.

సేఫ్టీ కోర్సుల సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకరరెడ్డి

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లోని సేఫ్టీ కోర్సుల్లో చేరి కోర్సు పూర్తి చేసిన వారికి ఆదివారం సర్టిఫికెట్లను అందించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకరరెడ్డి పాల్గొని ఫైర్ సేఫ్టీ, కెమికల్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేఫ్టీ కోర్సులు పూర్తి చేసిన వారికి విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, గైస్‌లో నిర్వహిస్తున్న కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కెమికల్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, సేఫ్టీ కోర్సుల కరిక్యులమ్ కో ఆర్డినేటర్ ఎ.వరహాలు పాల్గొన్నారు.

ఆలయాల ఆధునికీకరణ పనులకు శ్రీకారం



శంకుస్థాపనలో పాల్గొన్న రమాకుమారి

విశాఖ విద్య: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ తన సొంత నిధులు రూ.15 లక్షలతో జీవీఎంసీ 90 వ వార్డు గవరవీధిలో చేపట్టనున్న శివాలయం, సంతోషిమాత ఆలయాల ఆధునికీకరణ పనులకు యలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి, మోహన్ ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నమ్మి శ్రీను, చుక్క ప్రసాద్ రెడ్డి , గవర కమ్యూనిటీ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



మాట్లాడుతున్న రమాకుమారి



సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- సమాధులను సందర్శించిన క్రైస్తవులు

విశాఖ విద్య: ఈస్టర్ వేడుకలను ఆదివారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఎన్ఏడీ పరిసర ప్రాంతాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడ్ ఫ్రైడే తర్వాత మూడో రోజున క్రీస్తు సమాధుల నుంచి భక్తులకు దర్శనమిస్తారనే నమ్మకంతో క్రైస్తవులు సమాధులను సందర్శించారు. తెల్లవారుజామునే సమాధుల వద్దకు చేరి కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జీవీఎంసీ 52వ వార్డు కరాస శాంతివనంలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో యలమంచిలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏసు మార్గం అందరికీ అనుసరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ బీఎస్.కృష్ణ(ఆల్ఫా కృష్ణ) శాంతివనం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఎంఈఓ సోమేశ్వరరావు



ఎంఈఓకు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని గోపాలపట్నం ఎంఈఓ అంబటి సోమేశ్వరరావు అన్నారు. ఎన్ఏడీ నారాయణ పాఠశాల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కృష్ణం వందే జగద్గురు, దశావతారాలు, కంతార ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఎంఈఓ సోమేశ్వరరావు మాట్లాతుతూ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించడం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యాభివృద్ధిలో అంతా భాగస్వాములు కావాలన్నారు. నారాయణ విద్యా సంస్థల ఏజీఎం రాజ్ కుమార్, అకడమిక్ కో–ఆర్డినేటర్లు రామ్ నరేష్, ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ సూర్యారావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యాక్టివ్‌గా ఉన్న రౌడీలను హెచ్చరించారు. నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల పనులపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పది 'స్పాట్' రెమ్యునరేషన్ పెంపు

- ఒక్కో పేపర్ దిద్దేందుకు రూ.6.60 నుంచి రూ.10కు పెంపు
- స్పెషల్ అసిస్టెంట్లకు రూ.137 నుంచి రూ.300
- రెమ్యునరేషన్ పెంపుపై సర్వాత్రా హర్షం
- నేటి నుంచి పదో తరగతి మూల్యాంకనం



స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు (ఫైల్)

విశాఖ విద్య: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, అధికారులకు పెంచిన రెమ్యునరేషన్ చెల్లించేందుకు విద్యాశాఖ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై ఉపాధ్యాయ వర్గాలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నాయి. 2016లో నిర్ణయించిన రేట్లు ప్రకారమే స్పాట్ వాల్యూయేషన్ విధుల్లో పాల్గొనే వారికి పారితోషికం చెల్లించేవారు. దీనిపై ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, నాటి టీడీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్పాట్ వాల్యూయేషన్ రెమ్యునరేషన్ పెంపుపై ఉపాధ్యాయ సంఘాల నుంచి వచ్చిన వినతులను పరిగణలోకి తీసుకుంది.

ప్రభుత్వ పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ డి.దేవానందరెడ్డి దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో గతేడాది నుంచి రెమ్యునరేషన్ పెంపు అమల్లోకి వచ్చింది. ఉపాధ్యాయులకు సకాలంలో పారితోషికం చెల్లించేందుకు సైతం జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రెమ్యునరేషన్ పెంపు ఇలా..

ఒక్కో పేపరు దిద్దేందుకు అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు గతంలో రూ.6.60లు ఇవ్వగా, దీన్ని రూ.10కు పెంచారు. రోజుకు 40 పేపర్లు వరకు దిద్దేందుకు అవకాశం ఉండటంతో, ఎంతలేదన్నా రూ.264 పారితోషికం లభించనుంది. క్యాంప్ ఆఫీసర్‌కు రూ.385 నుంచి రూ.578కు పెంచారు. డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌కు రూ.330 నుంచి రూ.495లకు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌కు రూ.286ల నుంచి రూ.429లకు పెంచారు. ఎస్ఏలకు రూ.137.50లు నుంచి రూ.300లకు, సీఈలకు రూ.264 నుంచి రూ.396లుకు పెంచారు. ఎగ్జామినర్‌కు రూ.250లు నుంచి రూ.375కు పెంచారు. పరీక్షల ఇన్విజిలేషన్ విధుల్లో పాల్గొన్న వారికి కూడా గతంలో కన్నా రెమ్యునరేషన్ పెంచారు.

స్పాట్‌పై ఉపాధ్యాయుల్లో ఆసక్తి

ఏప్రిల్ 1 నుంచి జిల్లాలో పదో తరగతి మూల్యాంకనం ప్రారంభం కానుంది. జిల్లాకు కేటాయించిన జవాబు పత్రాల వాల్యూయేషన్‌కు అసిస్టెంట్ ఎగ్జామినర్లు 600 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 320 మంది, చీఫ్ ఎగ్జామినర్లుగా 90 మందికి విధులు కేటాయిస్తూ డీఈవో ఎల్.చంద్రకళ ఉత్తర్వులు జారీ చేశారు.

హర్షణీయం



పరీక్షలు, స్పాట్ వాల్యూయేషన్ విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు, సిబ్బందికి రెమ్యూనరేషన్ పెంచి, వాటిని సకాలంలో చెల్లించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవడం హర్షణీయం. అత్యవసర కారణాలు చూపే వారికి స్పాట్ విధుల్లో కొంతమినహాయింపు ఇవ్వాలి. దీనిపై ఇప్పటికే డీఈవో దృష్టికి తీసుకువెళ్లాం.

– ఇమంది పైడిరాజు,
ఎస్టీయూ జిల్లా కార్యదర్శి, విశాఖపట్నం

ఉపాధ్యాయులకు ప్రయోజనం



స్పాట్ వాల్యూయేషన్‌లో పాల్గొనే ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనం బాగుంది. గతంలో అయితే స్పాట్ విధులు మాకొద్దు అనే పరిస్థితులు ఉండేవి. కానీ అందరికీ ఆమోదకరమైన రీతిలో రెమ్యునరేషన్ ఇస్తుండటంతో ఉపాధ్యాయులు సంతోషంగానే విధుల్లో పాల్గొంటున్నారు.

– చొక్కాకుల సూర్యనారాయణ,
వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు, విశాఖ జిల్లా

కొనసాగుతున్న ఉక్కు రిలే దీక్షలు



1,144వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు తమ జీవితాల కోసం చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు పార్లమెంట్‌లో ప్రకటించాల్సిందేనన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1144వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ పోరాటం చేయడం రాష్ట్ర ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై సింహాచలేశుడు



గరుడ వాహనంపై అప్పన్న తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా తిరువీధి
- పరవశించిన భక్తజనం

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామికి గరుడ వాహనంపై తిరువీధి వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవిలను ముస్తాబుచేసి గరుడ వాహనంపై అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని ఘనంగా నిర్వహించారు. గరుడ వాహనంపై ఆశీనుడైన స్వామిని దర్శించుకుని భక్తులు పులకించిపోయారు. నృత్య కళాకారులు స్వామికి స్వాగతం పలికారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, రుత్వికులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.